సాక్షి
పెద్దపల్లి
బుధవారం । 23 । అక్టోబర్ । 2024



70 కేజీల ప్లాస్టిక్ సీజ్

కోల్‌సిటీ: బల్దియా హెల్త్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది నగరంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. కిరాణాలు, ఫ్రూట్ కంపెనీల్లో తనిఖీ చేసి 70 కేజీల ప్లాస్టిక్ వస్తువులు సీజ్ చేశారు.



విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తం

మంథని: ప్రమాదాలపై అప్రమత్తంగా ఉంటూ, నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తున్నామని ట్రాన్స్‌కో ఎస్ఈ సుదర్శన్ అన్నారు. మంథని, గోదావరిఖని అధికారులతో ఆయన సమావేశమయ్యారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.0/23.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

చిన్నబోయిన చేప

అంతర్గాం, రామగుండం, పాలకుర్తి మండలాల్లోని చెరువులు, కుంటల్లో చేపపిల్లలు వదిలేందుకు అధికారులు నాలుగు రోజుల క్రితం అక్కడకు చేరుకున్నారు. సైజ్ చిన్నగా ఉందని, సంఖ్య కూడా తక్కువగా ఉందని వాటిని చెరువులో విడుదల చేయకుండా మత్స్యకారులు నిరసన తెలిపారు. వాటిని వెనక్కి పంపించేశారు.

చేపపిల్లల సైజ్ చాలా చిన్నగా ఉందని, అయినా ఆగస్టులో పంపిణీ చేయాల్సింది పోయి గిప్పుడు చెరువులో పోస్తే బతుకుతయా అని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. మంథనిలోని ఓ చెరువులో చేపపిల్లలు వదిలేందుకు శనివారం వెళ్లిన కాంట్రాక్టర్, అధికారులను నిలదీశారు. చేసేదిలేక వాటిని పంపిణీ చేయకుండానే వారు వెనుదిరిగారు.



మంథనిలో మత్స్యకారుల నిరసన(ఫైల్)

- పరిమాణంలో వ్యత్యాసం
- సంఖ్యలోనూ గోల్‌మాల్
- నిబంధనలు పట్టని కాంట్రాక్టర్లు
- పట్టించుకోని అధికారులు
- జిల్లాలో చేపపిల్లల పంపిణీ లక్ష్యం 1.90కోట్లు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో మత్స్యశాఖ అధికారులు చేపట్టిన చేపపిల్లల ఉచిత పంపిణీలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. చెరువులు, కుంటల్లో విడుదల చేసేందుకు వెళ్లే అధికారులు, సిబ్బందితోపాటు కాంట్రాక్టర్లను మత్స్యకారులు ఎక్కడికక్కడే నిలదీయడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈనెల 7న మంథనిలోని తమ్మిచెరువులో ఫిషరీష్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ చేపపిల్లల పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. అయితే, నాణ్యత లోపం, సైజ్‌లో వ్యత్యాసం, సంఖ్యలోనూ తేడా ఉందని ఆరోపిస్తూ చెరువులో పోయకుండా మత్స్యకారులు వాటిని అడ్డుకున్నారు.

జిల్లా సమాచారం

మత్స్య సహకార సంఘాలు	146
చెరువు, కుంటలు	1,018
సభ్యుల సంఖ్య	11,500
చేపపిల్లల పంపిణీ లక్ష్యం(కోట్లలో)	1.90

చెరువులకు జలకళ..

- జిల్లాలో ఈసారి వర్షాలు విస్తారంగా కురిశాయి. చెరువులు, కుంటలన్నీ నీటితో జలకళ సంతరించుకున్నాయి. మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు వందశాతం రాయితీపై ప్రభుత్వం చేపపిల్లలు అందిస్తోంది. అవి ఎదిగిన తర్వాత మార్కెట్‌లో విక్రయించి అధిక ఆదాయం సాధిస్తే వారి కుటుంబాలు అభివృద్ధి చెందుతాయనేది లక్ష్యం. కానీ, ఆగస్టు చివరి నాటికి చెరువులు, కుంటల్లో చేపపిల్లలను విడుదల చేయాల్సి ఉంది. వివిధ కారణాలతో అక్టోబర్‌లో వాటిని పంపిణీకి శ్రీకారం చుట్టడం



చేప సైజును కొలుస్తున్న నాయకులు(ఫైల్)

వివాదాస్పదంగా మారుతోంది.

నిబంధనలు తూచ్..

- జిల్లాలోని మత్స్యకారులకు 1.90 కోట్ల చేపపిల్లలను అందించాలనేది సర్కారు లక్ష్యం. వీటిని సరఫరా చేసే బాధ్యతను ఇద్దరు కాంట్రాక్టర్లకు అప్పగించింది. అయితే, అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై, నాసిరకం, చిన్నసైజ్, తక్కువ సంఖ్యలో తెస్తున్నారని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. చేపపిల్ల సైజ్(పొడవు) 35 మి.మీ. – 40మి.మీ.తోపాటు 80 మి.మీ. – 100 మి.మీ.(రెండు పరిమాణాల్లో) వరకు ఉన్న

చర్యలు తీసుకోండి



వినతిపత్రం అందిస్తున్న క్రాంతికుమార్

మంథని: నాసిరకం, చిన్న పరిమాణంలోని చేపపిల్లలు పంపిణీ చేశారని, ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని మత్స్యసహకార సంఘం జిల్లా డైరెక్టర్ క్రాంతికుమార్ కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లోని ఫిషరీష్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌కు ఇటీవల వినతి పత్రం అందజేశారు. గతేడాది నుంచి పెండింగ్‌లో ఉన్న మంథని(కే–8) సొసైటీ కొత్త సభ్యత్వాలు త్వరగా అందించాలని కోరారు.

వాటిని పంపిణీ చేయాల్సి ఉండగా, అంతకన్నా తక్కువ సైజ్‌వి తీసుకొస్తున్నారని మత్స్యకారులు పేర్కొంటున్నారు.

అంతా మోసం..

చేపపిల్లల పంపిణీ నిబంధనలకు విరుద్ధంగా సాగుతోందని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. మత్స్యకారుల సంఘం నాయకులు, సభ్యులు, అధికారుల సమక్షంలో చేపపిల్లలను జలవనరుల్లో వదలాలని, ఆ సమయంలో కచ్చితంగా వీడియో చిత్రీకరించాలనే నిబంధనలు ఉన్నాయి. అంతేకాదు.. చేపపిల్లల సైజ్, వాటి సంఖ్య కూడా తెలియపర్చాలి. కానీ, కాంట్రాక్టర్లు కాకిలెక్కలు రాసుకుంటున్నారని, ఈ విషయంలో అధికారులు వారికే వత్తాసు పలుకుతున్నారని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు.

సైజ్‌లేదు.. లెక్కకు రావు



ప్రభుత్వం మత్స్యకారులకు ఉచితంగా అందిస్తున్న చేపపిల్లల పంపిణీ ప్రక్రియలో అన్నీఅక్రమాలే జరుగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా.. చాలా చిన్నసైజ్‌వి తెస్తున్నారు. వారికి తోచినన్ని.. తక్కువ సంఖ్యలో తీసుకొచ్చి చెరువుల్లో పోసేందుకు యత్నిస్తున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.

– క్రాంతి, మత్స్యకార సంఘం నేత, మంథని

అధికారుల అండతోనే అక్రమాలు



జిల్లా మత్స్యశాఖ అధికారి, కాంట్రాక్టర్ మిలాఖత్ అయ్యి మత్స్యకారులకు అన్యాయం చేస్తున్నారు. చేపపిల్లలను కొనుగోలు చేసిన సీడ్ కంపెనీకి మత్స్య సహకార సంఘం ప్రతినిధులను తీసుకెళ్లాలని సూచించినా పట్టించుకోవడం లేదు. నిబంధనల ప్రకారమైనా చేపపిల్లలు పంపిణీ చేయడంలేదు. మత్స్యకారులకు అండగా ఉండాల్సిన అధికారులపై ఫిర్యాదు చేస్తాం. ఈవిషయంలో వెనక్కి తగ్గేది లేదు.

– కొలిపాక నర్సయ్య, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు

ఆరోపణలు సరికాదు



మత్స్య సహకార సంఘంలోని కొందరు సభ్యులు కావాలనే ఆరోపణలు చేస్తున్నారు. చేపపిల్లల పరిమాణం చిన్నగా ఉన్నట్లు అంతర్గాంలో గుర్తించాం. నిబంధనల ప్రకారం తగిన పరిమాణం ఉండాలని కాంట్రాక్టర్‌కు సూచించాం. దీంతో మంథనికి సరైన పరిమాణంలోనే తీసుకొచ్చారు. అనవసరంగా కొందరు రాద్ధాంతం చేశారు. నిబంధనల మేరకే చేపపిల్లలు పంపిణీ చేస్తున్నాం. కాంట్రాక్టర్‌కు సహకరిస్తున్నామని ఆరోపణలు చేయడం అబద్ధం. – భాస్కర్, జిల్లా మత్స్యశాఖ అధికారి

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ విద్య



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ విద్య అమలుకు అనుసరించాల్సిన పద్ధతులపై కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. అజీం ప్రేమ్‌జీ సంస్థ ప్రతినిధులు, రాష్ట్రస్థాయి అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన ప్రీ స్కూల్ విద్య అమలుపై సమీక్షించారు. జూన్ నుంచి అక్టోబర్ వరకు సంగారెడ్డి జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ నిర్వహణకు అనుసరించిన పద్ధతులు సత్ఫలితాలు ఇచ్చాయని, ఆ పద్ధతులను పెద్దపల్లి జిల్లాలో అమలు చేసేందుకు అజీం ప్రేమ్‌జీ సంస్థ ప్రతినిధులు ముందుకొచ్చారని కలెక్టర్ వివరించారు. సిలబస్, బోధన తీరుపై సూపర్‌వైజర్లు, టీచర్లకు శిక్షణ ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో శిశు సంక్షేమశాఖ ప్రతినిధి రాహుల్, అజీం ప్రేమ్‌జీ సభ్యుడు శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌చార్జి సంక్షేమశాఖ అధికారి వేణుగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సన్న, దొడ్డు రకాలకు వేర్వేరు కౌంటర్లు..

ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సన్న, దొడ్డు రకం వడ్లకు కౌంటర్లు వేర్వేరుగా ఏర్పాటు చేయాలని కలెక్టకర్ శ్రీహర్ష ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌తో కలిసి ధాన్యం సేకరణపై సమీక్షించారు. గన్నీ సంచులు అందుబాటులో ఉంచడంతోపాటు కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించేందుకు లారీలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్యాడీ క్లీనర్లు, తేమ యంత్రాలు, తూకం మిషన్లు అందుబాటులో ఉంచాలని అన్నారు. డీసీవో శ్రీమాల, డీఆర్డీవో రవీందర్, డీఎం శ్రీకాంత్‌రెడ్డి, డీఎంవో ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తిచేయండి

జెడ్పీ నిధులతో చేపట్టిన అభివృద్ధి, అసంపూర్తి పనులను డిసెంబర్ వరకు పూర్తిచేయాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. వివిధ గ్రాంట్ల కింద మంజూరైన నిధులతో పనులు ప్రారంభం కాకుంటే అనవసరపు పనులను రద్దు చేయాలని, అవసరమైన వాటిని ప్రతిపాదించాలని సూచించారు.

15 నుంచి ఫోర్‌లేన్ పనులు..

మంచిర్యాల–వరంగల్ మధ్య చేపట్టే గ్రీన్‌ఫీల్డ్ హైవే ఫోర్‌లేన్ పనులు జిల్లాలో నవంబర్ 15న ప్రారంభమవుతాయని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. హైవే రోడ్డు పనులు, పెండింగ్ భూసేకరణపై రాష్ట్రస్థాయి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఈ విషయం వెల్లడించారు.

న్యూస్‌రీల్

4 నుంచి టాస్క్ నైపుణ్య శిక్షణ

పెద్దపల్లిరూరల్: స్థానిక టాస్క్ సెంటర్‌లో నవంబర్ 4వ తేదీ నుంచి నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. తొలి బ్యాచ్‌లో శిక్షణ పొందాలనుకునే వారు ఈనెల 30లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కనీసం 10రోజుల పాటు సాఫ్ట్, ఇంటర్వ్యూ, ఐటీ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తారని వివరించారు. ఇంగ్లిష్, ఇతర టెక్నికల్ స్కిల్స్ పెంచేందుకు శిక్షణ దోహదపడుతుందని, శిక్షణ తర్వాత ప్లేస్‌మెంట్ డ్రైవ్ ఉంటుందని ఆయన వివరించారు. వివరాలకు 95333 08928 నంబరులో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

మత్తుకు బానిస కావొద్దు



మాట్లాడుతున్న ఏసీపీ ఉపేందర్

సుల్తానాబాద్/సుల్తానాబాద్‌రూరల్: యువత మత్తుకు బానిసై తమ జీవితం నాశనం చేసుకోవద్దని యాంటి నార్కోటిక్స్ బ్యూరో ఏసీపీ ఉపేందర్ సూచించారు. స్థానిక కళాశాలలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. సరదా కోసం తీసుకునే గంజాయి ఆ తర్వాత వ్యవసనంగా మారుతోందన్నారు. మత్తు పదార్థాల విక్రయం, వినియోగం, సరఫరా గురించి తెలిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 1446కు సమాచారం ఇవ్వాలని సూచించారు. యాంటీ నార్కోటిక్స్ సీఐ కృష్ణమూర్తి, ఎస్సై శ్రావణ్‌కుమార్, కళాశాల డైరెక్టర్ సుష్మ, డాక్టర్ సింధూజ, ప్రిన్సిపాల్స్ కమలాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విజేతకు అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం సంగీత

రామగుండం: అంతర్గాం మండలం పొట్యాల జెడ్పీ హెచ్‌ఎస్ పదో తరగతి విద్యార్థి కె.గణేశ్ జాతీయ స్థాయి జూనియర్ టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచాడు. దీంతో ప్రధానోపాధ్యాయురాలు ఎం.సంగీత ఆధ్వర్యంలో మంగళవారం క్రీడాకారుడిని సత్కరించారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యం



సన్మానిస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా ఉద్యోగులు, అధికారులు పనిచేయాలని కోల్ కంట్రోల్ ఆర్గనైజర్స్ ఓఎస్‌డీ సుబ్రహ్మణ్యం, నాగపూర్ ఓఎస్‌డీ సతీశ్ గబియ్ సూచించారు. ఆర్జీ–1 ఏరియా జీడీకే–1, 3 గనిని మంగళవారం వారు సందర్శించారు. గనిలో పనిప్రదేశాలు తనిఖీ చేశారు. అనంతరం సుబ్రహ్మణ్యం, సతీశ్ గబియ్‌ను జీఎం లలిత్‌కుమార్ శాలువాతో సన్మానించారు. ఏరియా ఇంజినీర్ డీవీరావు, ఎస్‌వోటూ జీఎం రాంమోహన్, ఏజెంట్ రమేశ్, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, మేనేజర్ రమేశ్, కార్పొరేట్ అధికారులు శంకర్, రామరాజు, పర్సనల్ అధికారులు కిరణ్‌బాబు, కర్ణ పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపిక



ఆనంది

కమాన్‌పూర్(మంథని): మండల కేంద్రానికి చెందిన నల్లవెల్లి ఆనంది జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. ఈనెల 25 – 29వ తేదీ వరకు ఒడిశాలోని భువనేశ్వర్‌లో నిర్వహించే 39వ నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటుంది. కోచ్‌లు రమేశ్, రవీందర్‌తోపాటు తండ్రి శంకర్ ఆనందిని అభినందించారు. ఆమె ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది..

నేలవాలిన వరి



సుల్తానాబాద్ శివారులో దెబ్బతిన్న వరిపైరు

పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్(పెద్దపల్లి): వివిధ గ్రామాల్లోని వరిపంట వర్షానికి నేలవాలింది. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి చేతికి వచ్చిన పంట నేలవాలడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే, పొలంలో కాలువలు తవ్వి నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపిస్తే నష్టం ఏమీ ఉండదని జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి సూచించారు.

సమస్యల్లో 'వసతి'

జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలు సమస్యల్లో చిక్కుకున్నాయి. కొన్నింటికి సొంత భవనాలు లేవు. ఉన్న వాటిల్లో కనీస సౌకర్యాలు కరువై విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. మంగళవారం కొన్నింటిని 'సాక్షి' విజిట్ చేయగా సమస్యలు వెలుగులోకి వచ్చాయి..

మరుగుదొడ్లు అస్తవ్యస్తం



కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో 50 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. వీరి కోసం ఎనిమిది మరుగుదొడ్లు ఉన్నాయి. ఇందులో ఆరు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. రెండే రెండు పనిచేస్తున్నాయి. ఇవి విద్యార్థులకు సరిపోక ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన చెందుతున్నారు.

చన్నీటితోనే స్నానం



రామగిరి(మంథని): పన్నూర్‌లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో సుమారు 250 మంది విద్యార్థినులు చదువుతున్నారు. వీరికి వసతి కల్పించేందుకు మూడు నెలల క్రితం కొత్త భవనం ప్రారంభించారు. అయితే, ఇందులో గీజర్లు ఏర్పాటు చేయాలి. ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో బాలికలు చన్నీటి స్నానాలు చేస్తూ గజగజ వణుకుతున్నారు. మరోవైపు.. తరగతి గదుల్లో కూర్చోవడానికి బెంచీలు కూడా లేవు. నేలపైనే కూర్చొంటూ ఇబ్బందుల పాలవుతున్నారు.

చిమ్మచీకట్లు



కమాన్‌పూర్(మంథని): స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్ మార్గంలో వీధిలైట్లు లేవు. చిమ్మచీకట్లో వెళ్తూ విద్యార్థులు భయపడుతున్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివే పదో తరగతి విద్యార్థులు స్టడీ అవర్స్ ముగిశాక హాస్టల్‌కు చేరుకోవడం ఇబ్బందిగా మారింది. హాస్టల్‌లో సుమారు ఇరవై మంది వసతి పొందుతున్నారు. బోరునీటితోనే స్నానాలు చేస్తున్నారు.

ఇరుకు భవనం



పాలకుర్తి(రామగుండం): జయ్యారం ఎస్సీ బాలుర వసతి గృహం సౌకర్యాలు లేవు. సొంత భవనం లేక పంచాయతీ భవనంలోని రెండు గదుల్లో హాస్టల్ నిర్వహిస్తున్నారు. ఇందులో 45 మంది వసతి పొందుతున్నారు. దీంతో మంచాలను స్టోర్ రూంలో పడేశారు. కొందరు విద్యార్థులు నేలపై పరుపులు వేసుకుని పడుకోవాల్సి వస్తోంది. డైనింగ్‌హాల్ లేక ఆరుబయట భోజనం చేస్తున్నారు.

మహిళలకు ప్రభుత్వం అండ

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

జూలపల్లి(పెద్దపల్లి): పేద ఆడబిడ్డలకు కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 60 మంది లబ్ధిదారులకు రూ.60,06,960 విలువైన కల్యాణలక్ష్మి చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే పంపిణీ చేసి మాట్లాడారు. డబుల్‌బెడ్రూమ్ ఇళ్లు ఇస్తామని పేదలకు ఆశచూపుతూ గత ప్రభుత్వం పదేళ్లపాటు సెంటిమెంట్‌తో ఆడుకుందని ధ్వజమెత్తారు. త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. తహసీల్దార్ జక్కని స్వర్ణ, ఎంపీవో అనిల్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గండు సంజీవ్, ధూళికట్ట సింగిల్‌విండో చైర్మన్ వేణుగోపాల్‌రావు, మాజీ జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, ఆర్‌ఐ సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

గ్రామీణ రహదారులకు మహర్దశ

ఓదెల(పెద్దపల్లి): కాంగ్రెస్ హయాంలోనే గ్రామీణ రోడ్లు అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండల కేంద్రంలో చేపట్టిన రహదారుల విస్తరణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎంపీడీవో తిరుపతి పాల్గొన్నారు.

ఆస్తిపన్ను బకాయిలు రూ.7కోట్లు

ఓదెల(పెద్దపల్లి): పంచాయతీల్లో రూ.7.50 కోట్ల వరకు ఆస్తిపన్ను బకాయిలు ఉన్నాయని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు రూ.1.45 కోట్ల ఆస్తిపన్ను వసూలైందని ఆయన అన్నారు. వచ్చే నవంబర్‌లోగా బకాయిలు వసూలు చేయాలని ఆదేశించారు. ఇంటింటా సేకరించే చెత్తను ట్రాక్టర్ల ద్వారా కంపోస్టు షెడ్లకు తరలించి వర్మీకంపోస్టు ఎరువులు తయారు చేయాలని సూచించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. మంచినీటి బావుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని తెలిపారు. ప్రతీరోజు క్లోరోస్కోప్ ద్వారా ఆశ వర్కర్లు మంచినీటి పరీక్షలు చేయాలని సూచించారు. ఎంపీడీవో తిరుపతి, ఎంపీవో షబ్బీర్ ఉన్నారు.

శునకాలకు కు.ని. ఆపరేషన్లు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరంలో వీధికుక్కల సంతానం వృద్ధి చెందకుండా కుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేపట్టారు. సుప్రీంకోర్టు ఆదేశాలు, యానిమల్ బర్త్ కంట్రోల్ రూల్స్–2023 ప్రకారం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష వెల్లడించారు. ఇందుకోసం మల్కాపూర్ శివారులో యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్(ఏబీసీ) ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌కు చెందిన యానిమల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.

ప్రత్యేక ఆపరేషన్ థియేటర్..

ఏబీసీలో ప్రత్యేకంగా ఆపరేషన్ థియేటర్, సుమారు 50 కుక్కలను ఉంచేందుకు బోన్లు ఏర్పాటు చేశారు. పచ్చదనం–స్వచ్ఛదనం కింద గుర్తించిన కుక్కలకు ఇందులో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తారు. ఇందులో వారం పాటు ఉంచి, తర్వాత ఆయా ప్రాంతాల్లోనే వదిలిపెడతారు.



కుక్కకు ఆపరేషన్ చేస్తున్న వెటర్నరీ డాక్టర్

బల్దియాలో 4వేల వీధికుక్కలు..

నగరంలో సుమారు 3,500 – 4,000 వరకు వీధికుక్కలు ఉన్నట్లు గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. వీటన్నటింటికీ కు.ని. ఆపరేషన్లు చేస్తారు. ఈప్రక్రియ సుమారు 3– 4 నెలల్లో పూర్తిచేస్తారు.

భగ్గుమన్న రాజకీయ కక్షలు

- పథకం ప్రకారమే గంగారెడ్డిని హత్య చేసినట్లు అనుమానం
- కారుతో ఢీకొట్టి.. ఆనక కత్తితో పొడిచి..
- చంపుతానంటూ గతంలోనూ నిందితుడు వాట్సాప్‌లో మెసేజ్‌లు
- పోలీసులు పట్టించుకోలేదంటున్న కాంగ్రెస్ నాయకులు
- ఆందోళనకు దిగిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- జాబితాపూర్‌లో అంత్యక్రియలు పూర్తి

జగిత్యాలక్రైం: జగిత్యాలరూరల్ మండలం జాబితాపూర్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మారు గంగారెడ్డి హత్య వెనుక రాజకీయ కక్షలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం గంగారెడ్డి హోటల్ వద్ద టీ తాగి ఇంటికి వెళ్తుండగా.. అదే గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త బత్తిని సంతోష్ కారుతో వెంబడించి గంగారెడ్డి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో పాటు ఆయన కిందపడిపోయిన వెంటనే కారు దిగి విచక్షణారహితంగా పొడిచి పారిపోయిన ఘటన సంచలనంగా మారింది. స్థానికులు గంగారెడ్డిని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. గంగారెడ్డికి.. నిందితుడు సంతోష్‌కు ఎలాంటి గొడవలూ లేవు. ఎందుకు హత్య చేశాడో తెలియని పరిస్థితి నెలకొంది. రాజకీయ కక్షతోనే కొంతమంది సంతోష్‌ను ప్రోత్సహించి గంగారెడ్డిని హత్య చేయించి ఉంటారని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. హత్య విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు భారీగా తరలివచ్చారు. గంగారెడ్డిని హత్య చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆందోళనకు దిగారు. విషయాన్ని కొందరు ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన జగిత్యాలకు రావడం కాస్త ఆలస్యం కావడంతో జీవన్‌రెడ్డి 'నీకో దండం.. నీ పార్టీకో దండం' అంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. జాబితాపూర్‌తోపాటు జగిత్యాలలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నిందితుడు పోలీసులకు లొంగిపోయాడని తెలుసుకుని ఎస్పీ.. హత్య వెనుక ఎంతమంది ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో కాంగ్రెస్ నాయకులు ఆందోళన విరమించారు.



రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

జీవన్‌రెడ్డికి పీసీసీ అధ్యక్షుడు ఫోన్

మారు గంగారెడ్డి హత్య విషయం తెలుసుకుని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఫోన్ చేశారు. కావాలనే తన అనుచరుడిని రాజకీయ కక్షతో దారుణంగా హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో తాను ఉండేలా లేనని.. ఇకనైనా నన్ను బతకనివ్వండి అంటూ మహేశ్‌కుమార్‌తో అసహనం వ్యక్తం చేస్తూ మధ్యలోనే ఫోన్ కట్ చేశారు. కాంగ్రెస్ పార్టీ చంపేసింది చాలు.. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీలో ఎన్నో అవమానాలు భరిస్తున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు సీఎంవో కార్యదర్శి ఫోన్ చేయగా ఆయన హత్య వివరాలను అందించారు.

పోలీసు చర్యలపై అడ్లూరి అసహనం

ఇటీవల జాబితాపూర్ గ్రామంలో జరిగిన సంఘటనలపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ విప్ అడ్లూరి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన పోలీసులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. హత్య చేసిన వ్యక్తి గతంలో పలుమార్లు దాడులు చేసినా పట్టించుకోకపోవడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంత్యక్రియలు పూర్తి..

గంగారెడ్డి అంత్యక్రియల్లో ప్రభుత్వ విప్ అడ్లూరితోపాటు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొన్నారు. అంత్యక్రియలు పూర్తయ్యే వరకు అక్కడే ఉండిపోయారు. గంగారెడ్డిని జగిత్యాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా జీవన్‌రెడ్డి ఇటీవల ప్రతిపాదించారు. దాదాపు ఆయన పేరు ఖరారయ్యే అవకాశం ఉండగానే.. హత్యకు గురి కావడం చర్చనీయాంశంగా మారింది. కాగా, అవాంఛనీయ సంఘటనలు జరకుండా పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు.

పోలీసుల అదుపులో నిందితుడు

గంగారెడ్డిని హత్య చేసిన నిందితుడు కొద్ది గంటల్లోనే పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. పోలీసులు అతడిని దూరప్రాంత పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలుస్తోంది.

నిందితుడిపై హత్య కేసు నమోదు

గంగారెడ్డిని హత్య చేసిన బత్తిని సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గంగారెడ్డికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

క్లుప్తంగా

మద్యం మత్తులో బీభత్సం

వేములవాడఅర్బన్‌: పట్టణంలోని తిప్పాపూర్‌ శివారు వేములవాడ – సిరిసిల్ల రహదారిలో మద్యం మత్తులో ఓ వ్యక్తి కారుతో వాహనాలను ఢీకొట్టి బీభత్సం సృష్టించాడు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా పొలాసకు చెందిన ఎరదండి ప్రశాంత్‌ మద్యంతాగి తన ముగ్గురు పిల్లలతో కారులో సిరిసిల్ల వైపు వెళ్తున్నాడు. తిప్పాపూర్‌ శివారు శాభాష్‌పల్లికి చెందిన పర్శరాములు ద్విచక్రవాహనాన్ని ప్రశాంత్‌ కారుతో వెనుకనుంచి ఢీకొట్టడంతో పర్శరాములుకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం పార్కింగ్‌ చేసిన మూడు ద్విచక్రవాహనాల సైతం ఢీకొట్టాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. డ్రంకెన్‌ డ్రైవ్‌ చేసి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ టౌన్‌ ఎస్సై అంజయ్య పేర్కొన్నారు.

వ్యక్తిని కాపాడిన పోలీసులు



తంగళ్లపల్లి: మానేరు వంతెనపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించిన ఓ వ్యక్తిని తంగళ్లపల్లి పోలీసులు కాపాడారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కేసీఆర్‌నగర్‌కు చెందిన ఆడెపు తిరుపతి భార్యతో గొడవపడి మండలకేంద్రంలోని మానేరు వంతెన పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించాడు. అటుగా వెళ్తున్న కానిస్టేబుళ్లు అతడిని పట్టుకొని కౌన్సెలింగ్‌ నిర్వహించారు. పోలీస్‌ కానిస్టేబుళ్లు ప్రశాంత్‌, శ్రీనివాస్‌, అబ్బాస్‌, హోంగార్డు మిరాజ్‌ను ఎస్సై రామ్మోహన్‌ అభినందించారు.

సాయిబాబా ఆలయంలో చోరీ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లిలోని శ్రీషిర్డి సాయిబాబా ఆలయంలో సోమవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై రమాకాంత్‌ తెలిపిన వివరాలు.. రోజూలా గానే సాయంత్రం గుడికి తాళం వేసి పూజారి ఇంటికి వచ్చిన అనంతరం మంగళవారం ఉదయం ఆలయానికి వెళ్లగా.. గుడికి వేసిన తాళం పగులగొట్టి ఉంది. తాళం ధ్వంసం చేసిన దొంగలు లోనికి ప్రవేశించి ఆలయంలో ఉన్న హుండీని పగులగొట్టి అందులోని రూ.4వేల విలువగల వస్తువులు, నగదును ఎత్తు కెళ్లారు. ఈ ఘటనపై ఆలయ కమిటీ చైర్మన్‌ నర్ర అంజిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్‌

సిరిసిల్లఎడ్యుకేషన్‌: విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన ప్రభుత్వ ఉపాధ్యాయుపు నరేందర్‌ను సస్పెండ్‌ చేస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యాధికారి రమేశ్‌ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులను బ్యాడ్‌ టచ్‌ చేసినట్లు తెలుగు స్కూల్‌ అసిస్టెంట్‌ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న నరేందర్‌పై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై పూర్తి స్థాయి దర్యాప్తు చేసి సస్పెండ్‌ చేసినట్లు డీఈవో ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఉపాధి అవకాశాలకు కృషి చేస్తా

- అల్ఫోర్స్‌ అధినేత నరేందర్‌రెడ్డి

కరీంనగర్‌: కరీంనగర్‌, నిజామాబాద్‌, ఆదిలాబాద్‌, మెదక్‌ పట్టభద్రుల ఎన్నికల్లో తనను గెలిపిస్తే నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తానని అల్ఫోర్స్‌ అధినేత వి.నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలో పలు ప్రైవే టు, పాఠశాలలతో పాటు జూనియర్‌, డిగ్రీకళాశాలలో పనిచేస్తున్న పట్టభద్రులతో సమావేశమయ్యా రు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు ప్రకటించాలని కోరారు. తనకు ఒక్కసారి అవకాశం కల్పిస్తే విద్యారంగ సమస్యలపై మండలిలో గళమెత్తు తానని పునరుద్ఘాటించారు. హెల్త్‌కార్డుల మంజూ రు కోసం కృషి చేస్తానని అన్నారు. ప్రతి ఒక్కరూ నవంబర్‌ 06లోపు తమఓటును నమోదు చేసుకోవాలని సూచించారు.

టోకెన్‌ ఉంటేనే కొనుగోళ్లు

- తేమ శాతం 17 వస్తేనే జారీ
- ఏఈవోలకే బాధ్యత
- కౌలు రైతులైతే పట్టాదారుకు ఓటీపీ
- మార్గదర్శకాలు జారీ



కరీంనగర్‌ అర్బన్‌: ధాన్యం కొనుగోళ్లలో పక్కాగా వ్యవహరించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు మార్గదర్శకాలు జారీచేయగా తదనుగుణంగా యంత్రాంగం వ్యవహరించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. దొడ్డు, సన్నరకాల ధాన్యం కొనుగోళ్లకు వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఇక ఏఈవో టోకెన్‌ ఇస్తేనే కొనుగోలు చేయనున్నారు. నిబంధనల ప్రకారం ధాన్యముంటేనే ఎఫ్‌ఏసీ జారీ చేయనుండగా కేంద్రాల నిర్వహణకు స్పష్టమైన విధి, విధానాలను వెల్లడించారు. రైతులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం నిరంతరం తనిఖీలు చేపట్టనుంది. పర్యవేక్షణకు మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

నిబంధనలు ఇలా

ముందుగా కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసిన సమయంలో నిర్వాహకులు రైతు పేరు, వివరాలు నమోదు చేసుకుంటారు. వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈవో) ధాన్యం తేమ శాతం పరిశీలిస్తారు. 17 శాతం తేమ వచ్చిన తరువాత సంబంధిత రైతుకు టోకెన్‌ అందిస్తారు. దాని ప్రకారం ధాన్యాన్ని బస్తాల్లో ఎప్పుడు నింపుతారు, గోదాంకు ఎప్పుడు తరలిస్తారో.. చెబుతారు.

అక్రమాలకు ముకుతాడు

జిల్లా వ్యాప్తంగా 348 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. దాదాపు 5 లక్షల మెట్రిక్‌ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనావేసి సన్న, దొడ్డు రకం వడ్లను వేర్వేరుగా కొనడానికి కేంద్రాలు ఏర్పాటు చేశారు. టోకెన్‌ విధానం లేనప్పుడు కేంద్రం నిర్వాహకులు అవకతవకలకు పాల్పడేవారు. నగదు ముట్టజెప్పిన రైతుల ధాన్యాన్ని కాంటాలు వేసేవారనే ఆరోపణలున్నాయి. ఇక మిల్లర్లు ఆ ధాన్యానికి కోత విధించేవారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. ఇతర గ్రామాల ధాన్యాన్ని, దళారుల సరకునూ ఆయా నిర్వాహకులు కొనుగోలు చేసేవారు. దీంతో కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్న రైతులు ఇబ్బందులు పడాల్సివచ్చేది. కొనుగోళ్లలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందనే ఆరోపణలు రావడంతో టోకెన్‌ విధానాన్ని ప్రవేశపెట్టారు. సదరు విధానంతో అక్రమాలకు ఏలాంటి అస్కారముండదు. కాగా కేంద్రాల్లో పారదర్శకంగా కొనుగోళ్లు చేపట్టేలా ఆదేశాలు జారీచేశామని అధికారులు వివరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపడుతున్నామని తెలిపారు.

రైతులు చేయాల్సిందేంటీ.?

రైతు తన వెంట ఆధార్‌ కార్డు. పట్టా పుస్తకం. బ్యాంకు పాస్‌ పుస్తకం నకలును రెండు సెట్లు తీసుకురావాలి. కౌలు రైతు వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద పేరు నమోదు చేసుకోవాలి. ఆధార్‌, పాసుపుస్తకాలను ఆన్‌లైన్‌ చేయించుకోవాలి. పట్టాదారుకు ఓటీపీ వెళ్లినపుడు సదరు నంబర్‌ను చెబితే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ధాన్యం కాంటా పూర్తయిన రెండ్రోజుల్లో నగదు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుంది.

కొండగట్టు అంజన్న భక్తుల కానుకలు భద్రం

- 'సాక్షి' కథనంతో స్పందించిన ఈవో
- కానుకలు రిజిస్టర్‌లో నమోదుకు ఆదేశం
- స్టోర్‌ రూంలో భద్రపరచాలని ఉత్తర్వులు జారీ



కొండగట్టు ఆలయం

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయానికి వచ్చే భక్తులు పండ్లు, బెల్లం, చీరలు, వస్త్రాలు ఇతర కానుకలు ఆలయ అధికారులకు అందించి వెళ్తుంటారు. ఈ క్రమంలో ఆలయ అధికారులు ఇంతవరకు సామగ్రిని ఎక్కడ పెట్టారు..? ఏం చేశారో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో 'సాక్షి' ఈనెల 21న 'అంజన్న కానుకలు పక్కదారి' శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై ఆలయ ఈవో రామకృష్ణారావు వెంటనే స్పందించారు. భక్తులు సమర్పించే కానుకలన్నింటినీ రిజిస్టర్‌లో నమోదు చేసి, స్టోర్‌ రూంలో భద్రపరచాలని ఆలయ అధికారులకు మంగళవారం ఉత్వర్వులు జారీ చేశారు.

చిన్నారులకు కుళ్లిపోయిన గుడ్లు పంపిణీ



కుళ్లిపోయి పురుగులు పారుతున్న గుడ్లు

ముస్తాబాద్‌(సిరిసిల్ల): ముస్తాబాద్‌ మండలం పోతుగల్‌ అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం చిన్నారులకు కుళ్లిపోయిన కోడిగుడ్లు పంపిణీ చేశారు. రాజేందర్‌ అనే వ్యక్తి మనుమరాలికి పూర్తిగా కుళ్లిపోయి పురుగులు పారుతున్న గుడ్లు పంపిణీ చేయడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ముందుగా గుర్తించడంతో ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. పోతుగల్‌లో ఇంకెంత మందికి కుళ్లిన గుడ్లు పంపిణీ చేశారో.. ఎంత మంది వాటిని తిన్నారో తెలియడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోడిగుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్‌ నిర్లక్ష్యం ఒకవైపు కనిపిస్తుండగా, అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్ల ఉదాసీనత చిన్నారులు, బాలింతలు, గర్భిణుల ప్రాణాల మీదికి తెస్తోందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోతుగల్‌లోని అంగన్‌ వాడీ కేంద్రాలు పూర్తిగా నిర్లక్ష్యం నిర్వహిస్తున్నారని, అధికారులు పట్టించుకోకపోవడం వల్లె ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయన్నారు. కాగా ఈ ఘటనపై అంగన్‌వాడీ కేంద్రాల్లో విచారణ చేసినట్లు సూపర్‌వైజర్‌ అంజలి తెలిపారు. సదరు కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చామని, కేంద్రాల్లో నిర్లక్ష్యంపై అధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని సూపర్‌వైజర్‌ తెలిపారు.

ఎస్‌జీఎఫ్‌ పోటీలు ప్రారంభం



చెస్‌ ఆడుతున్న నరేందర్‌రెడ్డి, విద్యార్థులు

కొత్తపల్లి(కరీంనగర్‌): కొత్తపల్లి మండల పరిధిలోని అల్ఫోర్స్‌ ఇ-టెక్నో పాఠశాలలో మంగళవారం ఎస్‌జీఎఫ్‌ అండర్‌-19 చెస్‌, వాలీబాల్‌, జూడో, ఉషు క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎస్‌జీఎఫ్‌ కార్యదర్శి మధుజాన్సన్‌తో కలిసి ప్రారంభించిన అల్ఫోర్స్‌ విద్యాసంస్థల చైర్మన్‌ వి.నరేందర్‌రెడ్డి మాట్లాడారు. ప్రతి విద్యార్థి తప్పకుండా క్రీడా పోటీల్లో పాల్గొనాలని, మానసికోల్లాసం కలుగుతుందన్నారు. పీడీలు సరిత, సుష్మ, రాజశేఖర్‌, చందు, నారాయణ, విష్ణు, జూడో అఫిషియల్స్‌ ఎల్వీ రమణ, మహేందర్‌, శ్రీధర్‌, సాయిచందర్‌, సాయిరామ్‌యాదవ్‌, శ్యాం, యోగా అఫిషియల్స్‌ కిష్టయ్య, రామకృష్ణ, ఆనంద్‌, స్వరూపచారి, ప్రవీణ్‌, ఉషు అఫిషియల్స్‌ శ్రీనివాస్‌, సతీశ్‌, అశోక్‌, చెస్‌ అఫిషియల్స్‌ అనూప్‌కుమార్‌, సుజన్‌, అరుణ్‌, రేవిక్‌, నితన్‌, పాఠశాల ప్రిన్సిపాల్‌, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పారమితలో మేధో సంపత్తి దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొత్తపల్లి: కరీంనగర్‌ పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్‌ పాఠశాలలో మంగళవారం జాతీయ మేధో సంపత్తి దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భారత ప్రభుత్వ వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వశాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధనా పరిషత్తు గురించి ఆన్‌లైన్‌ విధానం ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌ నితిన్‌ తివారీ హెడ్‌ ఇంటెలెక్చువల్‌ ప్రాపర్టీ గ్రూప్‌, ఐపీఆర్‌ లైసెన్సింగ్‌ ఎగ్జిక్యూటివ్‌ నిధి చద్దాలు ప్రసంగించారు. పారమిత విద్యాసంస్థల చైర్మన్‌ ప్రసాద్‌రావు, ప్రధానోపాధ్యాయులు గోపికృష్ణ, డైరెక్టర్‌ హన్మంతరావు, ఐపీఆర్‌ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌ లలితమోహన్‌ సాహు, సమన్వయకర్తలు నాగరాజు, రాము పాల్గొన్నారు.

వేబ్రిడ్జి తూకంలో మోసం

- 20 కిలోల వ్యత్యాసం
- మిల్లు యజమాని దురుసు సమాధానం
- మార్కెట్‌ కార్యదర్శికి రైతు ఫిర్యాదు



ఫిర్యాదు పత్రంతో రైతు రామచంద్రం

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో పత్తి అమ్మకానికి తీసుకొచ్చిన ఓ రైతుకు తూకంలో మోసం జరిగింది. మార్కెట్‌కు అడ్తీ వ్యాపారి ద్వారా వాహనంలో పత్తి అమ్మకానికి తెచ్చారు. 20కిలో తూకం మోసం జరిగిందని ఫిర్యాదు చేశాడు. రైతు వివరాల ప్రకారం.. మండలంలోని మడిపల్లి గ్రామానికి ఒగ్గు రామచంద్రం ట్రాలీలో మూడు క్వింటాళ్ల 20కిలోల పత్తిని మార్కెట్‌కు అమ్మకానికి తెచ్చాడు. క్వింటాలకు రూ.6,560 ధర పలికింది. వేబ్రిడ్జి తూకంలో మోసం చేస్తున్నారన్న సమాచారంతో అనుమానంతో ముందుగానే పట్టణంలోని ఓ వేబ్రిడ్జిలో కాంటా వేయించాడు. అనంతరం పట్టణంలోని మంజూనాథ మిల్లుకు యాజమాని ఖరీదు చేశాడు. పత్తి వాహనాన్ని మిల్లులోని వేబ్రిడ్జిపై కాంట వేయగా.. ముందుగా వేసిన కాంటాకు, మిల్లులో వేసిన కాంటాకు 20కిలోల వ్యత్యాసం వచ్చింది. మిల్లువాళ్లను అడిగితే తేడా ఉంటుందని దురుసుగా సమాధానం ఇచ్చారు. దీంతో మార్కెట్‌ కార్యదర్శికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. 'మార్కెట్‌కు పత్తి అమ్మకానికి వచ్చిన రామచంద్రం అనే రైతు మంజునాథ మిల్లులో తూకంలో 20కిలోలు మోసం జరిగిందని ఫిర్యాదు చేసింది వాస్తవమే. మిల్లు యాజమానికి నోటీసులు అందజేస్తాం. లీగల్‌ మెట్రాలజీ అధికారులు జమ్మికుంటలోని ప్రతీ వేబ్రిడ్జి తనిఖీ చేయాలని ఫిర్యాదు చేశాం'. అని మార్కెట్‌ కార్యదర్శి మల్లేశం వివరణ ఇచ్చారు.

నాకిక దిక్కెవరే అన్నా

- ఏడాది క్రితం చనిపోయిన తల్లిదండ్రులు
- ప్రస్తుతం అన్న మృతితో ఒంటరైన 11 ఏళ్ల బాలిక



వంశీ(ఫైల్‌)



అన్న అంత్యక్రియలు నిర్వహిస్తున్న సంజన

ఇల్లంతకుంట(మానకొండూర్‌): ఏడాది క్రితం తండ్రి గుండెపోటుతో.. తల్లి అనారోగ్యంతో చనిపోయారు. అప్పటి నుంచి అన్నీ తానై తోడునీడగా ఉన్న అన్న మృతితో 11 ఏళ్ల బాలిక ఒంటరైంది. 'అన్నా నాకిక దిక్కెవరూ' అని ఏడుస్తూ అన్న మృతదేహానికి తలకొరివి పెట్టడం గ్రామస్తులను కలచివేసింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. ఇల్లంతకుంట మండలం వల్లంపట్లకు చెందిన నాయిని రాజేశం- దేవవ్వ దంపతులకు ఇద్దరు కూతుళ్లు వందన, సంజన, కొడుకు వంశీ (25) సంతానం. ఉపాధి కోసం రాజేశం దుబాయ్‌ వెళ్లేవాడు. ఉన్నంతలో పెద్ద కూతురు వందనకు పెళ్లి చేసి అత్తారింటికి పంపించారు. ఏడాది క్రితం రాజేశం దుబాయ్‌లో గుండెపోటుతో చనిపోయాడు. అప్పటికే దేవవ్వ కేన్సర్‌ బారినపడి మృతిచెందింది. ఆమె దహనసంస్కారాలు జరిగిన మూడు రోజులకే దుబాయ్‌ నుంచి రాజేశం మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. అతడి అంత్యక్రియలను కొడుకు నిర్వహించాడు. అప్పటి నుంచి సంజన ఆలనపాలనను వంశీ చూసుకుంటున్నాడు. తల్లిదండ్రులు చనిపోయి ఏడాది అవుతుండగా, మంగళవారం వంశీ సైతం కిడ్నీలు పాడయి అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో సంజన ఒంటరయింది. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. చిన్న వయస్సులో అన్నకు తలకొరివి పెట్టడం చూసి గ్రామస్తులు కన్నీరుపెట్టారు.

అనుమతి తేదీ మార్చి ఇసుక రవాణా

- మూడు ట్రాక్టర్లు పట్టివేత

బోయినపల్లి(చొప్పదండి): ఇసుక అనుమతులు పొందిన తేదీని మార్చి రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పృథ్వీధర్‌గౌడ్‌ మంగళవారం తెలిపారు. మండలంలోని తడగొండ గ్రామ శివారులో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు మూడు ఇసుక ట్రాక్టర్ల పర్మిషన్‌ పేపర్లు పరిశీలించారు. అందులో పర్మిషన్‌కు సంబంధించిన కార్బన్‌ పేపర్‌ రసీదులో తేదీని పెన్నుతో మార్చడం గమనించారు. మాన్వాడకు చెందిన ఒక ట్రాక్టర్‌, వెంకట్రావుపల్లికి చెందిన రెండు ట్రాక్టర్లను ఇలా గుర్తించారు. మూడు ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పీడీఎస్‌ బియ్యం.. ఇసుక ట్రాక్టర్‌..

వేములవాడరూరల్‌: ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌, బైక్‌పై తరలిస్తున్న పీడీఎస్‌ బియ్యాన్ని పోలీసులు పట్టుకుని సీజ్‌ చేసినట్లు రూరల్‌ ఎస్సై మారుతి తెలిపారు. మండలంలోని మర్రిపల్లి నుంచి మంగళవారం తరలిస్తుండగా 2 క్వింటాళ్ల బియ్యం, ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు.

లగ్గం సినిమాలో మనోళ్లు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 20 మంది
- 25న విడుదల కానున్న సినిమా



లగ్గం సినిమా బృందం

విద్యానగర్‌(కరీంనగర్‌): పెళ్లి అంటే రెండు కుటుంబాలు కలవడమే కాదు.. రెండు మనసులు కలవడం అన్న అంశంతో తెలంగాణ పెండ్లి సంప్రదాయాన్ని పెద్ద తెరపై ఆవిష్కరిస్తున్నారు మనోళ్లు. 'లగ్గం' పేరున సినిమాను కామారెడ్డికి చెందిన వేణుగోపాల్‌రెడ్డి నిర్మించగా కరీంనగర్‌ జిల్లా వీణవంక మండలం కనపర్తికి చెందిన చెప్యాల రమేశ్‌ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో ఉమ్మడి కరీంనగర్‌ జిల్లాకు చెందిన సినీ, యూట్యూబ్‌ స్టార్స్‌ ఆర్‌ఎస్‌ నంద, గుండ మల్లయ్య, రాధిక, తెలంగాణ లక్ష్మి, మిమిక్రి మహేశ్‌, సత్య ఎలేశ్వరం, సినీ పోస్టర్‌, టైటిల్‌ డిజైనర్‌ విష్ణువర్ధన్‌ రెడ్డి, అర్పిత, కాంతరెడ్డితోపాటు మరో 10మంది వరకు నటించడం విశేషం. లగ్గం సినిమా ఈనెల 25న విడుదల కానుంది.

పాటే ఆమె ప్రాణం..



పాట పాడుతున్న లావణ్య

శంకరపట్నం(మానకొండూర్‌): ఇప్పలపల్లి గ్రామానికి చెందిన జనగాం లావణ్య ఫోక్‌సాంగ్స్‌ పాడి పల్లె జనం, పట్టణ ప్రజల అభిమానం చురగొంటున్నారు. గ్రామీణ ప్రాంతమైన ఇప్పలపల్లిలో నివాసముంటూ భర్త రవీందర్‌ ప్రోత్సాహంతో నటనలోనూ సత్తా చూపుతున్నారు. బతుకమ్మ, పెళ్లి, వాన పాటలే కాకుండా.. వేములవాడ రాజన్న, కొండగుట్ట అంజన్న, కొమురవెల్లి మల్లన్న దేవతామూర్తుల పాటలు పాడుతూ భక్తుల గుండెల్లో చోటు సాధించారు. ఎల్‌ఆర్‌ ఫోక్స్‌ పేరిట యూట్యూబ్‌లో పాటలు, షార్ట్‌ఫిల్మ్‌లు విడుదల చేస్తున్నారు. భర్త రవీందర్‌, కూతురు మైత్రి, కొడుకు మనోజ్‌కుమార్‌తో కలిసి నటించారు. 90 వరకు పాటలు, షార్ట్‌ఫిల్మ్‌లలో నటించగా.. ఇప్పటివరకు 1.50లక్షల వ్యూయర్స్‌ ఉన్నారు.

కొండగట్టులో భక్తుల రద్దీ



కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. సుమారుగా 15వేల మంది భక్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. దర్శనానంతరం ప్రసాదాలు తీసుకుని తిరుగుపయనమయ్యారు. భక్తుల ఏర్పాట్లను ఈవో రామకృష్ణారావు, ఏఈవో అంజయ్య, అధికారులు, సిబ్బంది పర్యవేక్షించారు.



సరైన సమయంతో సత్ఫలితం

- వరిపంట కోస్తున్నారా..
- లేదంటే పంట దిగుబడిపై ప్రభావం
- వారం ముందు నుంచే నీటిని తొలగించాలి
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న అధికారులు
- జిల్లాలో 2.71 లక్షల ఎకరాల్లో వరి సాగైనట్లు అంచనా



వరి పైరును కోస్తున్న యంత్రం

వీణవంక: ఆరుగాలం కష్టపడి పంట సాగు చేయడం ఒక ఎత్తు.. కోత సమయంలో కాపాడుకోవడం మరో ఎత్తు. పైరు తారిపోకుండా సరైన సమయంలో కోతలు చేపడితే సత్ఫలితాలుంటాయి. లేదంటే గింజలు తారిపోయి దిగుబడిపై ప్రభావం పడుతుంది. జిల్లాలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఈసారి సన్నవడ్లను ప్రభుత్వం ప్రోత్సహించడంతో రైతులు సాగుకు దృష్టి సారించారు. ఆశించిన దిగుబడి వస్తుందని రైతులు ధీమాతో ఉన్నారు. కొన్ని ప్రాంతాల్లో చెరువు, కుంటలలో నీరు ఆశించిన స్థాయిలో ఉండటం..దీనికి తోడు ఎస్సారెస్పీ నీరు దిగువకు వదులుతుండటంతో పొలాల్లో తడి ఆరడంలేదు. ఎస్సారెస్పీ ఆయకట్టు మొదట ఉన్న పొలాల్లో కోత ఆలస్యమవుతుంది. గత్యంతరం లేక కొందరు రైతులు ట్రాక్‌మిషన్‌(వరి కోతయంత్రం)తో కోయిస్తున్నారు. గతేడాది కోతల సమయంలోని వర్షాలతో రైతులు నష్టపోయారు. కోత సమయంలో అవగాహన లేక భారీగా నష్టపోవాల్సి వచ్చింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతోపాటు మూడు నాలుగు రోజుల్లో వానలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతులు కలవరపడుతున్నారు. కాలపరిమితిని బట్టి ఆయా రకాల వరిపంటల కోత చేపట్టాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో ఈఏడాది 2.71లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారని అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

చివరి గింజ అయ్యేంత వరకు .....

- వరికోతకు 15 రోజుల ముందు నుంచే నీటి తడులను నిలిపేయాలి. తర్వాత పొలంలో కల్తీ గింజలు లేకుండా ఏరేయాలి.
- చివరి గింజ అయ్యేంత వరకు పొలం కోయకూడదు. లేదంటే తాలు వచ్చే ప్రమాదం ఉంది. తాలు ఎక్కువగా ఉంటే మార్కెట్లో ధాన్యం అమ్ముకోవడానికి ఇబ్బంది.
- మంచు ఆరిన తర్వాత పంట కోయాలి లేదంటే గింజలు మెత్తబడి నలుపు రంగులోకి వస్తాయి.
- యంత్రాలతో కోసేటప్పుడు రైతులు జాగ్రత్తగా ఉండాలి. ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉంది.
- కోసేముందు పొలం మడుల చుట్టూ గెట్ల వెంట వరి కోయాలి. దీంతో పరిగె నివారించవచ్చు. సీడ్‌ ప్లాంట్లకు ధాన్యం ఇచ్చే రైతులు కల్తీ గింజలు లేకుండా చూసుకోవాలి.

ఆరబెడితేనే నాణ్యత....

- ధాన్యం పలుచగా ఆరబెట్టడంతో తొందరగా ఎండుతుంది. దీంతో టాటిపత్రుల కిరాయి తప్పుతుంది.
- ఆరబోసిన తర్వాత రోజుకు కనీసం నాలుగు సార్లు దున్నాలి లేదా రోజుకోసారి ధాన్యం తిరగపోయాలి. దీంతో అడుగున ఉన్న గింజలు మీదికి వచ్చి సమానంగా ఆరుతాయి. తేమ శాతం త్వరగా తగ్గుతుంది.
- ఆరబెట్టకపోతే గింజలు రంగుమారి నాణ్యతా దెబ్బతింటుంది. అదేవిధంగా చెత్త, మట్టి, తాలు లేకుండా చూసుకోవాలి. తాలు ఎక్కువగా వస్తే గాలికి ఆరబోయాలి. నిబంధనల ప్రకారం తేమ శాతం ఉంటేనే కొనుగోలు చేస్తారు.
- సన్నరకం ధాన్యంను కొంతమంది రైతులు ఇండ్లలో నిల్వ చేసుకుంటారు. ఈసమయంలో బస్తాలను నేల మీద కాకుండా చెక్క బల్లలపై నెట్టు కొట్టడం వల్ల ఎలుకల బారినుంచి కాపాడుకోవచ్చు. ఎలుకల ఉధృతి ఎక్కువ ఉంటే బస్తాలపై లీటర్‌ నీటికి 5మీ.లీ మిలాథియాన్‌ మందు పిచుకారీ చేసుకోవాలి.
- అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. రైతులు అప్రమత్తంగా ఉంటూ వర్షాలు తగ్గిన తర్వాత కోతలు మొదలుపెడితే ఇబ్బంది ఉండదు.

నీటితడి నిలిపేయాలి

రైతులు వరి కోతలు సరైన సమయంలో చేపట్టాలి. తారిపోయేంత వరకు ఉంచకుండా చూసుకోవాలి. లేకుంటే గింజలు తారిపోయి దిగుబడిపై ప్రభావం పడుతుంది. కోతకు పది రోజుల ముందే నీటితడి నిలిపి వేయాలి. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పొలాలు తడి ఆరడం లేదు. కొందరు ట్రాక్‌ మిషన్లు పెట్టి కోస్తున్నారు. రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. – రాకేశ్‌ పటేల్‌, వ్యవసాయ విస్తీర్ణాధికారి, వీణవంక